ANN తెలుగు

Follow: @ANNTELUGU

REGISTERED NUMBER APTEL/2014/58382

02-02-2026

# మహా పత్రిక

తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 37 పేజీలు-04 వెల-రూ.6

PUBLISHED FROM TIRUPATI | HYDERABAD సోమవారం WWW.EPAPER.MAHAADAILY.COM



## కేసీఆర్‌ను విచారించిన సిట్

### నాలుగున్నర గంటల పాటు విచారణ

ఫోన్ ట్యాపింగ్, ఎమ్మెల్యేల ప్రలోభాల కేసు అంశంపై ప్రశ్నలు

విచారణపై జిల్లాల్లో బీఆర్ఎస్ నిరసనలు

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ఉత్కంఠ రేపుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు లో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ను ప్రత్యేక దర్యాప్తు బృందం ఆదివారం సుదీర్ఘంగా విచారించింది. హైదరాబాద్‌లోని నందినగర్ నివాసంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రారంభమైన ఈ విచారణలో కేసీఆర్‌ను సిట్ అధికారులు నాలుగున్నర గంటలకుపైగా ప్రశ్నించారు. కేసీఆర్ విచారణను సిట్ అధికారులు ఆడియో, వీడియో రికార్డు చేశారు. విచారణ అనంతరం నందినగర్ నుంచి సిట్ అధికారులు వెళ్లిపోయారు. విచారణ అనంతరం కేసీఆర్ నందినగర్ లోని తన బాల్కనీలోకి వచ్చి కార్యకర్తలకు అభివాదం చేశారు. అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. మున్సిపల్ ఎన్నికల గురించి ప్రస్తావించారు. పార్టీ క్షేత్రస్థాయిలో చాలా బలంగా ఉందన్నారు.

మిగతా 2లో

**టాప్ న్యూస్**

### బడ్జెట్ దెబ్బ



- కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు
- ఒకేసారి 8 లక్షల కోట్లు నష్టం

02

### హ్యాట్రిక్ క్రాష్

- బంగారం, వెండి మళ్ళీ ఢమాల్




02

### తెలంగాణకు గుండు సున్నానే..



- 8 మంది బీజేపీ ఎంపీలను గెలిపించినా తెలంగాణకు అన్యాయమే
- మోదీ చెప్పే కోఆపరేటివ్ ఫెడరలిజం ఇదేనా?
- కేంద్ర బడ్జెట్ పై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

02



**ఆర్థిక వృద్ధి, ఉపాధి కల్పనే లక్ష్యంగా..**

# రూ.53.47 లక్షల కోట్లతో కేంద్ర బడ్జెట్

## హైదరాబాద్‌కు బుల్లెట్ వేగం.. మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లు

- రక్షణ, రవాణా రంగాలకు అగ్ర తాంబూలం..
- పర్యాటక క్రీడారంగాలకు ప్రోత్సాహం.. జిల్లాకో బాలికల హాస్టల్
- వ్యవసాయం, గ్రామీణ మహిళా సాధికారతకు కీలక పథకాలు
- విద్యారంగానికి 6.22 శాతం పెరిగిన కేటాయింపులు
- ట్రంప్ టారిఫ్‌లకు.. బడ్జెట్‌తో కౌంటర్ స్ట్రైక్
- ఫార్మా, సెమికండక్టర్ల రంగంలో తెలంగాణకు మొండిచేయి
- 'ఆరెంజ్ ఎకానమీ'కి బూస్ట్.. దేశవ్యాప్తంగా కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌లు
- 81 నిమిషాల్లో బడ్జెట్ ప్రసంగం ముగించిన నిర్మలా సీతారామన్

**(ఢిల్లీ, హైదరాబాద్ - మహా)**

వికసిత్ భారత్ లక్ష్యంగా అడుగులేస్తున్న కేంద్ర ప్రభుత్వం 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టింది. స్వాతంత్ర్య భారతావని చరిత్రలో కేంద్ర బడ్జెట్‌ను ఆదివారం ప్రవేశపెట్టడం ఇదే తొలిసారి. వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టిన తొలి ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ రికార్డు సృష్టించారు. 202627 వార్షిక బడ్జెట్‌ను లోక్‌సభకు సమర్పించిన నిర్మలా సీతారామన్ మొత్తం రూ.53,47,315 కోట్లతో ప్రతిపాదించారు. ఇందులో రెవెన్యూ రాబడులను రూ.35,33,150 కోట్లుగా అంచనా వేసిన ఆర్థిక మంత్రి అందులో పన్నుల ద్వారా రూ.28,66,922 కోట్లు, పన్నేతర ఆదాయం ద్వారా రూ.6,66,228 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. మూలధన రాబడులను రూ.18,14,165 కోట్లుగా ప్రతిపాదించారు. మూలధన రాబడుల్లో రూ.16,95,768 కోట్లు అప్పులు ద్వారా సమీకరించనున్నట్లు వివరించారు. కేటాయింపుల్లో రక్షణ, రవాణా రంగాలకు అగ్ర తాంబూలం ఇచ్చిన నిర్మలమ్మ, గ్రామీణ భారతానికి నిధులు విదిల్చారు. అలాగే, వ్యవసాయానికి టెక్నాలజీ సొబగులు అద్దేలా కేటాయింపులు చేశారు. వ్యయానికి సంబంధించి, రెవెన్యూ వ్యయం రూ.41,25,494 కోట్లుగా పేర్కొన్నారు. ఇందులో వడ్డీ చెల్లింపులకే రూ.14,03,972 కోట్లు వెళ్లనున్నట్లు వివరించారు. మూల ధన వ్యయం రూ.12,21,821 కోట్లుగా ప్రతిపాదించారు. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు 4.4 శాతంగా అంచనా వేసిన ఆర్థికమంత్రి వచ్చే ఏడాది 0.1 శాతం తగ్గించాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు. ఇక రాబడులకు సంబంధించి ప్రతి రూపాయిలో రుణాలు ద్వారానే అత్యధికంగా

మిగతా 2లో

### బడ్జెట్ స్వరూపమిదే..

| | |
|---|---|
| మొత్తం బడ్జెట్ : | రూ.53,47,315 కోట్లు |
| రెవెన్యూ వసూళ్లు : | రూ.35,33,150 కోట్లు |
| మూలధన వసూళ్లు : | రూ.18,14,165 కోట్లు |
| పన్ను వసూళ్లు : | రూ.28,66,922 కోట్లు |
| పన్నేతర వసూళ్లు : | రూ.6,66,228 కోట్లు |
| రుణాల రికవరీ : | రూ.38,397 కోట్లు |
| ఇతర వసూళ్లు : | రూ.80,000 కోట్లు |
| అప్పులు, ఇతర వసూళ్లు : | రూ.16,95,768 కోట్లు |
| వడ్డీ చెల్లింపులు : | రూ.14,03,972 కోట్లు |



## తెలంగాణకు బడ్జెట్‌తో ఎంతో మేలు

### రాష్ట్రానికి మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లు

- కాకతీయ టెక్స్ టైల్ పార్క్ కు లబ్ది.. 33 బాలికల హాస్టళ్ళు
- ప్రపంచ వ్యాప్త పరిస్థితుల్లో ఇది అద్భుత బడ్జెట్
- బడ్జెట్ పై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి రియాక్షన్




**ఢిల్లీ, మహా :** కేంద్ర బడ్జెట్ గతేడాది కంటే ఈసారి పెరిగిందనని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఎరువుల రాయితీని కూడా కేంద్రం పెంచిందని దీని వల్ల తెలంగాణ రైతులు కూడా లబ్ధి పొందుతారన్నారు. ఆదివారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి.. కాకతీయ టెక్స్ టైల్ పార్క్ కు లబ్ధి కలిగే పథకాన్ని కేంద్రం తీసుకువచ్చిందన్నారు. దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలో ఒక బాలికల హాస్టల్ ను కేంద్ర ఏర్పాటు చేయనుందని చెప్పారు. రాష్ట్రంలో 33 జిల్లాలకు బాలికల హాస్టళ్లు మంజూరు అవుతాయన్నారు. రైల్వే బడ్జెట్ ను రూ. 2.77 లక్షల కోట్లకు పెంచిందన్నారు. రాష్ట్రానికి మూడు హైస్పీడ్ రైళ్లు రానున్నాయని, డేటా సెంటర్లకు ఉపయోగపడే నిర్ణయాన్ని మోడీ సర్కార్ తీసుకున్నదని చెప్పారు. డేటా సెంటర్లకు ఇచ్చే ప్రోత్సాహం వల్ల తెలంగాణకు కూడా లాభం జరుగుతుందన్నారు. విదేశీ విద్యపై పన్ను తగ్గించడం వల్ల తెలుగు విద్యార్థులకు ఎంతో మేలు జరగనుందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను స్థిరంగా ముందుకు తీసుకెళ్లేలా బడ్జెట్ రూపకల్పన చేశారని చెప్పారు. మెట్రో రైలు గురించి ప్రత్యేకంగా బడ్జెట్ లో ఉండదని కిషన్ రెడ్డి అన్నారు. ఇది అర్బన్ డెవలప్ మెంట్ మినిస్ట్రీస్ ఇస్తుంటుందని మెట్రోపై డీపీఆర్ ఇస్తే పట్టణాబివృద్ధి శాఖ నిధులు ఇస్తుందన్నారు. ఆ మాత్రం అవగాహన లేకుండా మాట్లాడితే ఎలా అని ప్రశ్నించారు.

మిగతా 2లో

## తెలంగాణకు కేంద్ర బడ్జెట్‌లో మొండిచేయి

### మేం చేసిన తప్పేంటి..?

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫైర్..!
- మూసీ, ట్రిపుల్ ఆర్ , మెట్రో విస్తరణపై కేంద్రం నిర్లక్ష్యం
- 'ఆరెంజ్ ఎకానమీ'ని బాంబేకి తరలించడం రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయానికి పరాకాష్ట
- కెమికల్ పార్క్, మెడికల్ హబ్ జాబితాలో రాష్ట్రానికి చోటేదీ?



**హైదరాబాద్, మహా:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి తామంతా ఢిల్లీ వెళ్లి ప్రధానిని, కేంద్ర ఆర్థిక మంత్రిని పలు మార్లు కలిసి విన్నవించినప్పటికీ, ఒక్క విన్నపాన్ని కూడా కేంద్రం పరిగణనలోకి తీసుకోకపోవడం దారుణమని ఆయన ధ్వజమెత్తారు. "తెలంగాణ ఏం తప్పు చేసింది?" అని ప్రశ్నిస్తూ, కేంద్రం వివక్షాపూరిత వైఖరిపై ఆయన నిప్పులు చెరిగారు. రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమైన రీజినల్ రింగ్ రోడ్ , మెట్రో విస్తరణ, , మూసీ ప్రక్షాళన ప్రాజెక్టుల కోసం కేంద్రం నుండి భారీగా నిధులు అందుతాయని ఆశించామని భట్టి పేర్కొన్నారు. మూసీ పునరుజ్జీవం కోసం కేంద్ర సాయం కోరినప్పటికీ బడ్జెట్‌లో దాని ఊసే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ ప్రపంచానికే ఫార్మా హబ్‌గా ఉన్నప్పటికీ, కేంద్రం ప్రకటించిన కెమికల్ పార్కుల జాబితాలో తెలంగాణకు చోటు కల్పించకపోవడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్ హయాంలో ఈసీఐఎల్ వంటి దిగ్గజ సంస్థలను హైదరాబాద్‌కు తెచ్చామని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఉన్నవాటిని కూడా పట్టించుకోవడం లేదని విమర్శించారు.

మిగతా 2లో

## ధరలు పెరిగేవి.. తగ్గేవి వస్తువులు ఇవే..

### విదేశీ ప్రయాణం మరింత సులువు

స్మార్ట్ ఫోన్లు, ల్యాప్ టాప్ లకు తగ్గింపు.. షూటింగ్ కెమెరాలు ప్రియం



**ఢిల్లీ, మహా :** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్ దేశ ఆర్థిక వ్యవస్థతో పాటు సామాన్యుల రోజువారీ ఖర్చులపై ప్రత్యక్ష ప్రభావం చూపనుంది. పలు దిగుమతి సుంకాలు తగ్గించడం, కొన్ని రంగాలకు రాయితీలు ఇవ్వడం వల్ల అనేక వస్తువుల ధరలు తగ్గే అవకాశం ఉంది. అయితే మరికొన్ని వస్తువులు మాత్రం మరింత ఖరీదుగా మారనున్నాయి. ఈ నేపథ్యంలో బడ్జెట్ తర్వాత ఏయే ధరలు పెరుగుతాయి? ఏవి ధరలు తగ్గుతాయి? అనే అంశాలు పరిశీలిద్దాం.

#### ప్రజలకు ఊరట : ధరలు తగ్గే వస్తువులు

**విదేశీ ప్రయాణం మరింత సులువు :** విదేశీ టూరిజం ప్యాకేజీలపై ఇప్పటివరకు విధిస్తున్న ట్యాక్స్ కలెక్ట్ ఎట్ సోర్స్ ను 5 శాతం నుంచి 2 శాతానికి తగ్గించారు. దీంతో విదేశీ పర్యటనలకు వెళ్లే మధ్యతరగతి, ఉద్యోగ వర్గాలకు ఖర్చు కొంత మేర తగ్గనుంది.

**విదేశీ విద్య మరింత అందుబాటు..**

విదేశాల్లో చదువుకోవాలనుకునే విద్యార్థుల తల్లిదండ్రులకు ఇది శుభవార్త. లిబరలైజ్డ్ రెమిటెన్స్ స్కీం (ఎల్ఆర్ఎస్) కింద విద్యా ఖర్చులపై విధించే టీడీఎస్ రేటు తగ్గించారు. దీంతో ఫీజుల చెల్లింపులు తేలిక కానున్నాయి.

**మద్యం తయారీ ముడిసరుకు చౌక**

ఆల్కహాల్ తయారీలో ఉపయోగించే కొన్ని ముడిసరుకులు, కొన్ని రకాల ఖనిజాలపై కస్టమ్స్ డ్యూటీ 5శాతం నుంచి 2శాతానికి తగ్గించారు. దీని ప్రభావం పానీయాల ధరలపై పరోక్షంగా కనిపించవచ్చు.

**షూ ఎగుమతులకు ఊతం**

పాదరక్షల తయారీ రంగానికి పెద్ద ఊరట లభించింది. షూ అప్పర్ తయారీకి అవసరమైన ముడిసరుకులను

## ఆర్థిక వృద్ధి, ఉపాధి కల్పనే లక్ష్యంగా..

# రూ.53.47 లక్షల కోట్లతో కేంద్ర బడ్జెట్

(మొదటిపేజీ తరువాయి)

24 పైసలు సేకరించనున్నట్లు తెలిపారు. ఆదాయ పన్ను ద్వారా 21 పైసలు, కార్పొరేట్ పన్నుల ద్వారా 18 పైసలు, జీఎస్టీ, ఇతర పన్నుల ద్వారా 15 పైసలు, పన్నేతర ఆదాయం 10 పైసలు, కేంద్ర ఎక్సైజ్ సుంకాల ద్వారా 6 పైసలు, కస్టమ్స్ సుంకాల ద్వారా 4 పైసలు, రుణేతర మూల ధన రాబడుల ద్వారా 2 పైసలు వస్తాయని అంచనా వేశారు.

**బడ్జెట్‌లో పథకాలకే పెద్దపీట**

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం ప్రవేశపెట్టిన జంబో బడ్జెట్‌ను రూ.53.47కోట్లతో పద్దు ప్రతిపాదించారు. అయితే ఈసారి బడ్జెట్‌లో పథకాలకు అగ్రతాంబూలం ఇచ్చారు. మొత్తం బడ్జెట్‌లో 43శాతం నిధులను కేవలం స్కీమ్స్ కోసమే కేటాయించారు. కేంద్రం 202627 ఆర్థిక సంతవ్సరంలో రూ.23.21లక్షల కేట్లను వివిధ రకాల పథకాల కోసం కేటాయింపులు చేసింది. ఇది మొత్తం బడ్జెట్‌లో 43శాతం. ఈ పథకాలను రెండు వర్గాలుగా కేంద్రం విభజించింది. అందులో ఒకటి సెంట్రల్ సెక్టార్ స్కీమ్స్, రెండోది కేంద్ర ప్రాయోజిత పథకాలు (సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీమ్స్). ఈ రెండింటిలో కూడా సెంట్రల్ సెక్టార్ స్కీమ్స్‌కు ఏకంగా 17.22 లక్షల కోట్లు కేటాయించింది. సెంట్రల్ సెక్టార్ స్కీమ్స్‌ను సైతం కేంద్రం ఐదు రకాలుగా విభజించింది. 1. జనరల్ సర్వీస్, 2. ఎకానమిక్ సర్వీస్, 3. సోషల్ సర్వీస్, 4. సబ్సిడీ, 5. ఇతర స్కీమ్స్ ఉన్నాయి. వీటిలో సబ్సీడీల కోసం ఏకంగా రూ.4.55లక్షల కోట్లను కేంద్రం ప్రతిపాదించింది. ఇందులో ఫుడ్ సబ్సిడీ కోసం రూ.2.28 లక్షల కోట్లు కాగా, ఫెర్టిలైజర్ సబ్సిడీ కోసం రూ. 1.71లక్షల కోట్లను కేటాయించింది. అలాగే, పెట్రోలియం సబ్సిడీ కోసం రూ. 0.12లక్షల కోట్లను ప్రతిపాదించింది.

**రాష్ట్రాలకు రూ.4.41లక్షల కోట్లు**

ఈ బడ్జెట్‌లో కేంద్రం రాష్ట్రాలకు ఇచ్చే నిధుల విషయాన్ని కూడా ప్రస్తావించింది. రూ.4.41లక్షల కోట్లను 202627 ఆర్థిక సంవత్సరంలో పన్నులు, ఇతర రూపాల్లో ఇవ్వనున్నట్లు పేర్కొంది. ఇందులో 16వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.29 లక్షల కోట్లు ఉంటాయని ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో ప్రతిపాదించారు. 2026 2027 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం వడ్డీ చెల్లింపులకు భారీగా కేటాయింపులు చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.14.04లక్షల కోట్లు వడ్డీ చెల్లింపులకే కేటాయించినట్లు కేంద్రం వెల్లడించింది. అలాగే, జీతాల కోసం రూ.1.66లక్షల కోట్లు, పెన్షన్స్ కోసం రూ.2.96లక్షల కోట్లను కేంద్రం ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించింది.

**20లక్షల నిపుణులు అవసరమని అంచనా**

యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని కేంద్రం ప్రభుత్వం తెలిపింది. 2030 నాటికి 20లక్షల మంది నిపుణులు అవసరమని అంచనా వేస్తోంది. ఈ మేర డిమాండ్‌ను అందుకునేందుకు వీలుగా ముంబయిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్ నేతృత్వంలో దేశవ్యాప్తంగా 15వేల పాఠశాలలు, 500 కాలేజీల్లో ఏవీజీసీ కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని తాజా బడ్జెట్‌లో ప్రతిపాదించింది.

## ఆరెంజ్ ఎకానమీకి బడ్జెట్ బూస్ట్

బడ్జెట్‌లో సృజనాత్మక రంగాలకు పెద్దపీట వేసే ప్రయత్నం చేసింది కేంద్ర ప్రభుత్వం. 'ఆరెంజ్ ఎకానమీ' లక్ష్యంగా ఆయా రంగాల్లో సృజనాత్మకతను ప్రోత్సహించి, భవిష్యత్తులో సృష్టించే ఉపాధి అవకాశాలకు సరిపడే నైపుణ్యాలతో సిద్ధంగా ఉండేందుకు చర్యలు చేపడుతున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. మీడియా, మేధోసంపత్తి, వినోదం వంటి క్రియేటివ్ రంగాలను సూచించే పదమే ఆరెంజ్ ఎకానమీ. భౌతిక ఉత్పత్తుల కన్నా ప్రధానంగా ఆలోచనలు, సృజనాత్మకత, సాంస్కృతిక సంపద నుంచి వచ్చే విలువను ఇలా పేర్కొంటారు. ఇంకా యానిమేషన్, వీఎఫ్ఎక్స్, గేమింగ్, డిజైన్, టూరిజం, కామిక్స్, వినోదం వంటి రంగాలు ఇందులోకి వస్తాయి.



## బడ్జెట్లో రూపాయి రాబడి

- అప్పులు - 24 శాతం
- ఆదాయ పన్ను - 21 శాతం
- కార్పొరేషన్ పన్ను - 18 శాతం
- జీఎస్టీ, ఇతర పన్నులు - 15 శాతం
- పన్నేతర ఆదాయం - 10 శాతం
- ఎక్సైజ్ డ్యూటీ - 6 శాతం
- కస్టమ్స్ ఆదాయం - 4 శాతం
- రుణం లేని మూలధనం - 2 శాతం

## రూపాయి పోయేది ఇలా..

- రాష్ట్రాలకు పన్ను చెల్లింపులు - 22 శాతం
- రుణాలకు వడ్డీ చెల్లింపులు - 20 శాతం
- కేంద్ర ప్రభుత్వ పథకాలు - 17 శాతం
- రక్షణ రంగం - 11 శాతం
- కేంద్ర ప్రాయోజిత పథకాలు - 8 శాతం
- ఆర్థిక సంఘం, ఇతర బదిలీలు - 7 శాతం
- ఇతర ఖర్చులు - 7 శాతం
- ప్రధాన సబ్సిడీలు - 6 శాతం
- పౌర పింఛన్లు - 2 శాతం

## రంగాల వారీగా ఇవీ కేటాయింపులు

- రవాణా రంగం - రూ.5,98,520 కోట్లు
- రక్షణ రంగం - రూ.5,94,585 కోట్లు
- గ్రామీణాభివృద్ధి రంగం - రూ.2,73,108 కోట్లు
- హోంశాఖ కార్యకలాపాలు – రూ.2,55,234 కోట్లు
- వ్యవసాయ అనుబంధ రంగాలు - రూ.1,62,671 కోట్లు
- విద్యారంగం - రూ.1,39,289 కోట్లు
- ఇంధన రంగం - రూ.1,09,029 కోట్లు
- వైద్య, ఆరోగ్యం - రూ.1,04,599 కోట్లు
- పట్టణాభివృద్ధి - రూ.85,522 కోట్లు
- ఐటీ, టెలికాం - రూ.74,560 కోట్లు
- వాణిజ్యం, పరిశ్రమలు - రూ.70,296 కోట్లు
- సాంఘిక సంక్షేమం - రూ.62,362 కోట్లు
- శాస్త్ర సాంకేతిక రంగాలకు - రూ.55,756 కోట్లు
- పన్ను నిర్వహణ - రూ.45,500 కోట్లు
- ఎక్స్‌టర్నల్ ఎఫైర్స్ - రూ.22,119
- ఆర్థిక నిర్వహణ - రూ.20,649 కోట్లు
- ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి - రూ.6,812 కోట్లు

## హ్యాట్రిక్ క్రాష్

### .. బంగారం, వెండి మళ్ళీ ధమాల్

**మహా:** దేశంలో బంగారం ధరలు మరోసారి భారీగా పడిపోయాయి. వరుసగా మూడో రోజూ అమాంతం దిగివచ్చాయి. శనివారంతో పోలిస్తే ఆదివారం బంగారం ధరలు భారీ తగ్గుదలను నమోదు చేశాయి. వెండి ధరలూ భారీగా పతనమ్యాయి. ఆదివారం మార్కెట్ ప్రారంభం నాటికి గోల్డ్ రేటు 10 గ్రాములపై 6 శాతం తగ్గి రూ.1,43,205కి చేరుకుంది. ఇక కేజీ వెండి ధరలు ఎంసీఎక్స్‌లో రూ.2.65 లక్షల వద్ద ప్రారంభమయ్యాయి. యూఎస్ డాలర్ బలపడటంతో ప్రపంచవ్యాప్తంగా అమ్మకాలు మొదలయ్యాయి. దీంతో పెట్టుబడిదారులు లాభాలను నమోదు చేసుకోవడంతో ఎంసీఎక్స్‌లో బంగారం, సిల్వర్ ధరలు కుప్పకూలుతున్నాయి.

## ధరలు పెరిగేవి.. తగ్గేవి వస్తువులు ఇవే..

### విదేశీ ప్రయాణం మరింత సులువు
### స్మార్ట్ ఫోన్లు, ల్యాప్ టాప్ లకు తగ్గింపు..
### షూటింగ్ కెమెరాలు ప్రియం

(మొదటిపేజీ తరువాయి)

డ్యూటీ ఫ్రీగా దిగుమతి చేసుకునేందుకు అనుమతి ఇచ్చారు. దీంతో ఎగుమతులు పెరిగి, ఉపాధి అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉంది.

**సోలార్ పరికరాలు చౌక**

పునరుత్పాదక ఇంధన రంగానికి పెద్ద ఊతం లభించింది. సోలార్ ప్యానళ్లకు అవసరమైన కీలక ముడిసరుకులపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీ (బీడీఎస్)ని పూర్తిగా తొలగించారు. దీంతో సోలార్ విద్యుత్ ప్రాజెక్టుల వ్యయం తగ్గనుంది.

**గ్రీన్ ఎనర్జీకి ప్రోత్సాహం :**

ఎనర్జీ ట్రాన్సిషన్‌కు అవసరమైన పరికరాలపై కూడా బీడీఎస్‌ను తొలగించారు. అదేవిధంగా క్యాపిటల్ గూడ్స్, కీలక ఖనిజాలపై కూడా సుంకం మినహాయింపు ఇచ్చారు.

**ఎలక్ట్రానిక్స్ ధరలు తగ్గే అవకాశం :**

వ్యక్తిగత వినియోగ ఎలక్ట్రానిక్ వస్తువులపై కస్టమ్స్ డ్యూటీని 20శాతం నుంచి 10శాతానికి తగ్గించారు. దీని వల్ల ల్యాప్‌టాప్‌లు, గాడ్జెట్లు, ఇతర పరికరాల ధరలు కొంత మేర తగ్గే సూచనలు ఉన్నాయి.

అలాగే భారత్‌లో తయారైన స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్లు కూడా మరింత అందుబాటు ధరల్లో లభించే అవకాశం ఉంది.

**ఆరోగ్య రంగానికి పెద్ద ఊరట :**

క్యాన్సర్, అరుదైన వ్యాధులు, డయాబెటిస్ చికిత్సకు ఉపయోగించే 17 రకాల ఔషధాలపై కస్టమ్స్ డ్యూటీని పూర్తిగా తొలగించారు. దీంతో ప్రాణాంతక వ్యాధుల చికిత్స ఖర్చు గణనీయంగా తగ్గనుంది.

తీరప్రాంతం నుంచి ప్రత్యేక ఆర్థికమండలి(సెజ్) పరిధి వరకు ఉన్న సముద్ర జలాల్లో మన జాలర్లు పట్టిన చేపలపై సుంకం తగ్గింపు

అణు విద్యుత్ ప్రాజెక్టుల పరికరాలపై రాయితీలు, విద్యుత్ వాహనాల బ్యాటరీలపై డ్యూటీ తగ్గింపు, విమాన విడిభాగాల దిగుమతిపై సడలింపులు

**ధరలు పెరిగే అంశాలు :**

**పన్ను ఎగవేతకు భారీ జరిమానా :**

ఆదాయపు వివరాలు సరిగా చూపని వ్యక్తులపై విధించే జరిమానాను 100 శాతానికి పెంచారు. దీంతో పన్ను ఎగవేత మరింత ఖరీదైన వ్యవహారంగా మారనుంది. బహిర్గతం చేయని చరాస్థులపై కొత్తగా జరిమానా విధింపు అమల్లోకి వచ్చింది.

**షేర్ మార్కెట్ ట్రేడింగ్ ఖరీదు :**

ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ట్రేడింగ్‌పై అదనపు పన్ను భారం విధించడం వల్ల ట్రేడర్లకు ఖర్చు పెరగనుంది.

**విలాస వస్తువులు మరింత ఖరీదు :**

లగ్జరీ వాచ్‌లు, ఆల్కహాల్, సిగరెట్లు, బీడీలు, పాన్ మసాల, గుట్కా వంటి వస్తువులపై పన్నులు పెంచడం వల్ల వీటి ధరలు పెరగనున్నాయి.

**కాఫీ యంత్రాలు ఖరీదు :**

కాఫీ రోస్టింగ్, బ్రూవింగ్, వెండింగ్ యంత్రాలపై సుంకం పెరగడం వల్ల కేఫ్‌లు, హోటళ్ల నిర్వహణ ఖర్చు పెరిగే అవకాశం ఉంది.

**ఎరువుల ధరలపై అనుమానాలు :**

కొన్ని రకాల ఎరువులపై దిగుమతి ఫీజులను తొలగించినా, అమోనియం ఫాస్ఫేట్, అమోనియం నైట్రో ఫాస్ఫేట్ వంటి ఎరువుల ధరలు పెరిగే అవకాశం ఉంది.

**కెమెరాలు, షూటింగ్ పరికరాలు :**

చిత్రీకరణ పరికరాలు, ప్రొఫెషనల్ కెమెరాలపై సుంకం పెరగడంతో సినిమా, మీడియా రంగానికి ఖర్చు పెరగనుంది.

## బడ్జెట్ దెబ్బ

### కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు
### ఒకేసారి 8లక్షల కోట్లు నష్టం

**మహా:** కేంద్ర బడ్జెట్ 2026 ప్రకటన స్టాక్ మార్కెట్లకు భారీ షాక్ ఇచ్చింది. ఫ్యూచర్స్, ఆప్షన్స్ ట్రేడింగ్‌పై సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్టీటీ) పెంచాలన్న ప్రభుత్వ నిర్ణయంతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు తెగబడ్డారు. ఫలితంగా, గత ఆరేళ్లలో బడ్జెట్ రోజున సూచీలు ఇంత భారీగా పతనం కావడం ఇదే తొలిసారి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో ఎస్టీటీ పెంపును ప్రకటించడమే ఈ అమ్మకాలకు ప్రధాన కారణమైంది. ఫ్యూచర్స్ ట్రేడ్స్‌పై పన్నును 0.02 శాతం నుంచి 0.05 శాతానికి, ఆప్షన్స్ ప్రీమియంపై పన్నును 0.1 శాతం నుంచి 0.15 శాతానికి పెంచారు. ఈ నిర్ణయంతో ట్రేడింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో అమ్మకాలు వెల్లువెత్తాయి. బడ్జెట్ ప్రసంగానికి ముందు దూసుకుపోయిన సెన్సెక్స్, నిఫ్టీ భారీ నష్టాలతోముగిసాయి. బడ్జెట్‌లో సారం లేదనడానికి మార్కెట్ పతనమే రుజువు అని నెటిజన్లు వ్యాఖ్యానించారు. ఎస్టీటీపెంపు ప్రకటించిన వెంటనే స్టాక్ మార్కెట్ గందరగోళంలో పడింది. పెట్టుబడిదారులు ఒకేసారి రూ.8 లక్షల కోట్లు కోల్పోయారు.

## తెలంగాణకు హైస్పీడ్ రైళ్లు

### 3 కారిడార్ల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్

#### హైదరాబాద్ బెంగుళూరు, హైదరాబాద్ చెన్నై, హైదరాబాద్ పుణె రైల్ కారిడార్ లు

**హైదరాబాద్, మహా:** తెలంగాణకు 3 హైస్పీడ్ కారిడార్లను కేంద్రం ప్రకటించింది. దేశంలో కొత్తగా 7 నగరాల మధ్య హైస్పీడ్ రైల్ కారిడార్లు ప్రకటించగా పుణెహైదరాబాద్, హైదరాబాద్‌బెంగళూరు, హైదరాబాద్‌చెన్నై కారిడార్లు తెలంగాణ మీదుగా వెళ్లనున్నాయి. వీటితో పాటు ముంబయిపుణె, ఢిల్లీవారణాసి, వారణాసిసిలిగుడి, చెన్నైబెంగళూరు మధ్య కూడా కొత్త కారిడార్ల నిర్మాణం చేపట్టనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రకటించారు. వీటికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు రూ.12.2 లక్షల కోట్లు కేటాయిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గత సంవత్సరం రూ.11.2 లక్షల కోట్లు కేటాయించగా ఈసారి స్వల్పంగా పెంచారు. దేశంలో మొత్తం ఏడు కారిడార్లు ప్రకటించగా, అందులో మూడు హైదరాబాద్ వే కావడం భవిష్యత్‌లో హైదరాబాద్ హైస్పీడ్ జంక్షన్ గా మారుతుందనడానికి నిదర్శనంగా చెప్పుకోవొచ్చు. దేశ మౌలిక సదుపాయాల కల్పన గురించి మాట్లాడుతూ ఈ కారిడార్ల గురించి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. వీటి ద్వారా ప్రధాన ఆర్థిక, సాంస్కృతిక కేంద్రాల మధ్య అనుసంధానం పెరుగుతుందని అన్నారు. సుదూర ప్రయాణాల విషయంలో పర్యావరణహితమైన రవాణా వ్యవస్థగా ఈ కారిడార్లు మారుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇవి ప్రయాణ సమాయాన్ని కుదిస్తాయని, రహదారి మార్గం, ఇప్పటికే ఉన్న రైలు నెట్‌వర్క్‌లో రద్దీని తగ్గిస్తాయని పేర్కొన్నారు.

## దేశవ్యాప్తంగా జిల్లాకొక బాలికల హాస్టల్

### బడ్జెట్‌లో నిర్మలా సీతారామన్

**ఢిల్లీ, మహా:** దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలో బాలికల వసతి గృహం ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. ప్రధాన పారిశ్రామిక లాజిస్టిక్స్ కేంద్రాలకు సమీపంలో 5 విశ్వవిద్యాలయ టౌన్‌షిప్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. టౌన్‌షిప్‌లలో నివాస సౌకర్యాలు, పరిశోధన మౌలిక సదుపాయాలతో పాటు విశ్వవిద్యాలయాలు, కళాశాలలు ఉంటాయి. దేశవ్యాప్తంగా 15,000 కంటే ఎక్కువ పాఠశాలల్లో కంటెంట్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయడానికి ముంబయిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్‌కు మద్దతు అందిస్తున్నట్లు తెలిపారు.

**భారతీయ క్లినికల్ ట్రయల్ సైట్‌ల నెట్‌వర్క్ ఏర్పాటు**

పశువైద్య కళాశాలలు, ఆసుపత్రులు, డయాగ్నస్టిక్స్ ప్రయోగశాలలకు రుణ సంబంధిత మూలధన సబ్సిడీ మద్దతు పథకాన్ని ఆమె ప్రకటించారు. గుజరాత్ జామ్‌నగర్‌లోని ఆయుష్ ఫార్మసీలు, ఔషధ పరీక్ష ప్రయోగశాలలు, డబ్ల్యుహెచ్ వో సంప్రదాయ వైద్య కేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. వెయ్యి కంటే ఎక్కువ గుర్తింపు పొందిన భారతీయ క్లినికల్ ట్రయల్ సైట్‌ల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగుల కోసం సహాయక పరికరాల ఉత్పత్తిని పెంచడానికి ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు నిధులు కేటాయించనున్నట్లు ప్రతిపాదించారు.

## బడ్జెట్ తరువాత చౌకగా లభించే వస్తువులు...

- విమాన భాగాలు
- మైక్రోవేవ్ ఓవెన్లు
- ఈవీ బ్యాటరీలు
- సోలార్ ప్యానెల్స్
- డయాబెటిక్ & క్యాన్సర్ మందులు
- భారతదేశంలో తయారయ్యే స్మార్ట్ ఫోన్లు
- టాబ్లెట్లు

**ఖరీదైనవిగా మారే వస్తువులు**

- లగ్జరీ గడియారాలు
- దిగుమతి చేసుకున్న మద్యం
- సిగరెట్లు
- బీడీలు
- పాన్ మసాలా
- గుట్కా
- కొన్ని ఎరువులు
- దిగుమతి చేసుకున్న టీవీ పరికరాలు, కెమెరాలు & సినిమా షూటింగ్ కోసం ఉపయోగించే ఇతర పరికరాలు

## తెలంగాణకు బడ్జెట్‌తో ఎంతో మేలు


(మొదటిపేజీ తరువాయి)

బడ్జెట్‌లో లేకుండానే కేబినెట్ ఆమోదంతో అనేక రాష్ట్రాలకు నిధులు ఇస్తుంటామన్నారు. హైదరాబాద్ మెట్రో ఎల్ అండ్ టీ నుంచి టేకోవర్ చేయాలి. ఆ తర్వాత డీపీఆర్ సిద్ధం చేస్తే ప్రాసెస్ మొదలవుతుందన్నారు. జీ రామ్ జీ గ్రామాభివృద్ధికి సంబంధించినవేనన్నారు. ఈ బడ్జెట్ ఉద్యోగ, ఉపాధి కేంద్రీకృతంగా రూపొందించారన్నారు. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలకు నిధులు పెరిగాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో అద్భుతంగా ప్రవేశపెట్టిన బడ్జెట్ ఇది అన్నారు. మార్కెట్ ఒడిదుడుకులు అన్ని సర్ధుకుంటాయని చెప్పారు.




## తెలంగాణకు కేంద్ర బడ్జెట్‌లో మొండిచేయి

(మొదటిపేజీ తరువాయి)



తెలంగాణ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రతిష్టాత్మకంగా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసిందని, అయితే కేంద్రం స్పోర్ట్స్ విభాగంలోనూ రాష్ట్రానికి మొండిచేయి చూపిందని భట్టి విమర్శించారు. అఫోర్డబుల్ స్పోర్ట్స్ గూడ్స్ గురించి విజన్ డాక్యుమెంట్‌లో తెలంగాణ గురించి ప్రముఖంగా చెప్పినా, బడ్జెట్ కేటాయింపుల్లో అది ఎక్కడా కనిపించలేదన్నారు. హైదరాబాద్ సెంట్రిక్‌గా ఉండాల్సిన 'ఆరెంజ్ ఎకానమీ'ని కూడా బాంబేకి తరలించడం రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయానికి పరాకాష్ట అని ఆయన పేర్కొన్నారు.

# కేసీఆర్‌ను విచారించిన సిట్

(మొదటిపేజీ తరువాయి)

కేటీఆర్, హరీశ్‌రావు, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో కేసీఆర్ సమావేశమయ్యారు. అనంతరం నందినగర్ నుంచి ఎర్రవల్లికి బయల్దేరారు. కేసీఆర్ విచారణ సందర్భంగా బీఆర్ఎస్ నిరసనలకు పిలుపునివ్వగా, పలు జిల్లాల్లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలిపారు.

**సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా**

నందినగర్ నివాసంలో కేసీఆర్‌ను ఆరుగురు అధికారుల బృందం ప్రశ్నించింది. గతంలో సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా కేసీఆర్‌ను సిట్ అధికారులు ప్రశ్నించారు. కేసీఆర్ ఎదుట అందుకు సంబంధించిన ఆధారాలు ఉంచి ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు అంశంపై ఆడియోలు ఎలా వచ్చాయనే అంశంపై సిట్ సుదీర్ఘంగా విచారణ చేపట్టింది. ఈ కేసు విచారణని ముగించుకున్న అనంతరం కేసీఆర్ నివాసం నుంచి సిట్ అధికారులు వెళ్లిపోయారు. ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్ ఆదేశాలు ఎవరి సూచనలతో జారీ అయ్యాయనే విషయంపై, నిర్ణయ ప్రక్రియలో కేసీఆర్ పాత్రపై సిట్ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు.

**ఈ కేసులో ఏం లేదని తేలిపోయింది - కేటీఆర్**

కేసీఆర్ సిట్ విచారణ అనంతరం పార్టీ నాయకులతో కలిసి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఈ కేసులో లీకులే తప్ప ఆధారాలు లేవని, కేసులో డొల్లతనం బయటపడిందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో మా అటెన్షన్ దెబ్బతీయడానికే ఈ విచారణలు చేపట్టినట్లు ఆరోపించారు. విచారణ ఎవరి ఆధీనంలో జరుగుతుందో అర్థం కావడం లేదని అన్నారు. విచారణ చేసేది సిట్టా, పీసీసీనా లేక బీజేపీనా? అని విమర్శించారు. సీఎం రేవంత్ గాలి మాటలు మాట్లాడుతూ గాలికి తిరుగుతున్నారు.. ఇదిగో పులి, అదిగో తోక అంటూ డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. సిట్ చట్టాన్ని అతిక్రమించినా కేసీఆర్ విచారణకు సహకరించారన్నారు. సిట్‌కు సంపూర్ణంగా కేసీఆర్ సహకరించారని స్పష్టం చేశారు. ప్రతి ప్రశ్నకు కుండబద్దలు కొట్టినట్టుగా కేసీఆర్ సమాధానమిచ్చారని స్పష్టం చేశారు. ఎలాంటి తప్పు జరగలేదని నేటి విచారణతో తేలిపోయిందన్నారు.

# తెలంగాణకు గుండు సున్నానే

- **8 మంది బీజేపీ ఎంపీలను గెలిపించినా తెలంగాణకు అన్యాయమే**
- **మోదీ చెప్పే కో-ఆపరేటివ్ ఫెడరలిజం ఇదేనా?**
- **కేంద్ర బడ్జెట్ పై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

**హైదరాబాద్, మహా:** వరుసగా 12వ ఏడాది కేంద్రంలోని బీజేపీ సర్కారు తెలంగాణకు గుండు సున్నానే దక్కిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఎక్స్ వేదికలో స్పందించారు. పన్నెండేళ్లుగా తెలంగాణను మోసం చేయటం బీజేపీకి అలవాటుగా మారిందని మండిపడ్డారు. కోఆపరేటివ్ ఫెడరలిజం అంటూ ప్రధాని మోడీ నిత్యం చెబుతుంటారు కానీ ఆచరణలో మాత్రం పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. విభజన హామీలు సహా తెలంగాణ ప్రాజెక్ట్ లకు రావాల్సిన నిధులన్నింటినీ పెండింగ్ లో పెట్టారని విచారం వ్యక్తం చేశారు. స్థిరత్వం, క్రమశిక్షణ, వృద్ధి అంటూ నినాదాలు చెప్పే బీజేపీ పెద్దలు ఎందుకు తెలంగాణ విషయంలో వివక్ష చూపుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు.

**8 మంది ఎంపీలను ఇస్తే తిరిగి ఇచ్చింది గుండుసున్నా...**

తెలంగాణ నుంచి బీజేపీకి 8 మంది ఎంపీలను ఇస్తే రాష్ట్రానికి మాత్రం గుండుసున్నా ఇచ్చారని మండిపడ్డారు. రాష్ట్రానికి నిధులు రావాల్సిన దానికి బదులు పెండింగ్ ఫైల్స్ వస్తున్నాయన్నారు. 34 వేల 367 కోట్ల తో చేపట్టాల్సిన రీజినల్ రింగ్ రోడ్, హైవేలు, రేడియల్ రోడ్లకు నిధులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మెట్రో ఫేజ్ 2 విస్తరణకు ఇవ్వాల్సిన 50 శాతం నిధులు ఇవ్వలేదన్నారు. కొత్త రైల్వే లైన్స్‌కు క్లియరెన్స్ లు ఇవ్వకపోగా, వరంగల్ కోచ్ ఫ్యాక్టరీని అటకెక్కించారని మండిపడ్డారు. తెలంగాణకు దక్కాల్సిన ఐఐఎం, 16 నవోదయ విద్యాలయాలు, 9 కేంద్రీయ విద్యాలయాలను ఇవ్వటం లేదన్నారు. విభజన చట్టం హామీలైన బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా పారిశ్రామిక ప్రోత్సహకాలు ఏమీ ఇవ్వలేదన్నారు. ఇలా చెప్పుకుంటే పోతే తెలంగాణకు బీజేపీ చేసిన అన్యాయాల జాబితా చాంతాడంతా ఉందన్నారు. ప్రధాని మోడీ చెప్పే కో ఆపరేటివ్ ఫెడరలిజం అంటే తెలంగాణ ప్రయోజనాలను కాలరాయమటేనా అని ప్రశ్నించారు.

# ఏప్రిల్ 1 నుంచి కొత్త ఐటీ చట్టం అమలు

**కీలక మార్పులు చేసిన నిర్మల**



**న్యూఢిల్లీ, మహా :** కొత్త ఆదాయపు పన్నుకు సంబంధించి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఒక ప్రధాన ప్రకటన చేశారు. ఆదాయపు పన్ను ఫారమ్‌లను సరళీకరించనున్నట్లు పేర్కొన్నారు. కొత్త చట్టం ఏప్రిల్ 1, 2026 నుంచి అమల్లోకి వస్తుంది. సాంకేతిక లోపాలను జరిమానాలుగా మార్చడానికి ఈ చట్టం పని చేస్తుంది. చిన్న ట్యాక్స్ నేరాలకు జరిమానాలు మాత్రమే విధిస్తారు. విదేశీ ప్రయాణాలపై పన్నులు తగ్గించారు. విదేశీ ప్రయాణాలకు టీసీఎస్ రేటు 5 శాతానికి తగ్గించారు. జూలై 31 వరకు రిటర్న్‌లను దాఖలు చేయవచ్చు. ఈ చట్టం అప్రకటిత ఆదాయాన్ని కోటి రూపాయలకు పరిమితం చేయాలని కూడా ప్రతిపాదిస్తుంది. వ్యక్తిగత, స్మాల్ ట్యాక్స్ పేయర్స్‌కు ఈ బడ్జెట్ భారీ ఉపశమనం కలిగించింది. ఆదాయపు పన్ను రిటర్న్‌లను (ఐటీఆర్ లు) సవరించడానికి గడువును పొడిగించడంతోపాటు మరికొన్ని మార్పులు చేశారు. నిబంధనలను మరింత సరళీకృతం చేశారు. విధానపరమైన భారాలను తగ్గించడం, తప్పులకు జరిమానాలను తగ్గించడం వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి కొత్త ఆదాయపు పన్ను చట్టం అమలుకు పన్ను చెల్లింపుదారులను సిద్ధం చేయడం ఈ చర్యల లక్ష్యం.

నామమాత్రపు రుసుముతో పన్ను చెల్లింపుదారులకు తమ దాఖలులో తప్పులను సరిదిద్దుకోవడానికి ఎక్కువ సమయం ఇస్తామని బడ్జెట్ ప్రసంగంలో నిర్మలా సీతారామన్ తెలిపారు. దాఖలు ప్రక్రియను మరింత సులభతరం చేశారు. ఫ్లెక్సిబుల్ రిటర్న్‌ఫైలింగ్ క్యాలెండర్‌ను కూడా ఆవిష్కరించనున్నట్లు సీతారామన్ తెలిపారు.

## మార్చి 31 వరకు సవరించిన ఐటీఆర్ దాఖలుకు అనుమతి

బడ్జెట్ లో కీలకమైన ప్రకటనలలో ఒకటి సవరించిన ఆదాయపు పన్ను రిటర్న్‌లను దాఖలు చేయడానికి కాలపరిమితిని పొడిగించడం. ఆర్థిక సంవత్సరం చివరి వరకు పన్ను చెల్లింపుదారులు తమ రిటర్న్‌లను సవరించుకోవడానికి అనుమతి ఉంటుందని ఆర్థిక మంత్రి చెప్పారు. నామమాత్రపు రుసుముతో మార్చి 31 వరకు సవరించిన ఐటీఆర్ ను దాఖలు చేయ వచ్చని పేర్కొన్నారు. ఈ చర్య వల్ల ఐటీ దాఖలు చేసిన వారు లోపాలు లేదా ఇతర మార్పులు చేర్పులు చేసుకోవడానికి వీలు కలుగుతుంది. ప్రస్తుతం గడువు, అధిక జరిమానాతో నష్టపోయిన వారికి ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. మార్చి 31 వరకు సవరణలను అనుమతించడంతో పన్ను చెల్లింపుదారులు, వ్యవస్థ మధ్య ఒక విధమైన సమతుల్యతను సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. చిన్న పన్ను చెల్లింపుదారులకు ప్రక్రియను సులభతరం చేయడం, పన్ను మినహాయింపు (టీడీఎస్) ప్రక్రియలను సులభతరం చేయడానికి, ఎలాంటి గందరగోళం లేకుండా చేసే సంస్కరణలను ప్రకటించడంపై సీతారామన్ దృష్టి సారించారు. క్రమబద్ధీకరించిన విధానాలతో పాటు, రిటర్న్ కోసం సుదీర్ఘ టైంలైన్, మరింత నిర్మాణాత్మక ఫైలింగ్ షెడ్యూల్‌ను ప్రతిపాదించారు. సీతారామన్ ఇలా అన్నారు: ""ఆదాయ పన్ను చట్టం, 2025, ఏప్రిల్ 1, 2026 నుంచి అమలులోకి వస్తుంది. ప్రక్రియను సులభతరం చేయడానికి, రిటర్న్‌లను దాఖలు చేయడానికి నేను ఫ్లెక్సిబుల్ టైంలైన్‌ను ప్రతిపాదిస్తున్నాను: ఐటీఆర్ 1, ఐటీఆర్ 2 ఉపయోగించే వ్యక్తులు జూలై 31 వరకు దాఖలు చేయడం కొనసాగించవచ్చు, అయితే ఆడిట్ కాని వ్యాపార కేసులు, ట్రస్టులకు ఆగస్టు 31 వరకు సమయం ఉంటుంది.

# కేంద్ర బడ్జెట్ సామాన్యుడికి ఊరట

**కిమ్స్ సీఎండీ డా. బొల్లినేని భాస్కర్ రావు**

**సుంకాల రద్దు వల్ల తగ్గనున్న చికిత్సఖర్చులు**

**హైదరాబాద్, మహా :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా సంక్షేమానికి అద్దం పడుతోందని కిమ్స్ సీఎండీ డా. బొల్లినేని భాస్కర్ రావు అన్నారు. ముఖ్యంగా 17 రకాల క్యాన్సర్ మందులపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని రద్దు చేయడంతో పాటు, మరో ఏడు రకాల అరుదైన వ్యాధుల మందులకు మినహాయింపు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ నిర్ణయం వల్ల చికిత్స ఖర్చులు గణనీయంగా తగ్గి, ప్రాణరక్షక మందులు రోగులకు సులభంగా అందుబాటులోకి వస్తాయన్నారు. ఇది బాధిత కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించడమే కాకుండా, వైద్యులు కూడా మెరుగైన చికిత్స అందించడంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించేందుకు దోహదపడుతుందన్నారు. మౌలిక సదుపాయాల రంగానికి భారీగా నిధులు కేటాయించడం దేశాభివృద్ధికి కీలకమని తెలిపారు. పటిష్టమైన మౌలిక సదుపాయాల వల్ల కేవలం ఆర్థిక వృద్ధే కాకుండా, ఆరోగ్య సేవలు, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు.

# దేశ ఆకాంక్షలను ప్రతిబింబించిన బడ్జెట్

**ప్రధాన మంత్రి మోదీ ప్రశంసలు**



**ఢిల్లీ, మహా:** ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేడు పార్లమెంటులో ప్రవేశపెట్టిన 202627 కేంద్ర బడ్జెట్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. ఈ బడ్జెట్‌ను 'అద్భుత అవకాశాల రహదారి'గా అభివర్ణించారు. ఈ బడ్జెట్ ద్వారా భారతదేశం ప్రయాణిస్తున్న 'సంస్కరణల ఎక్స్‌ప్రెస్'కు కొత్త శక్తి, ఊపు లభిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దేశ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ, భవిష్యత్ తరాలకు బలమైన పునాది వేసేలా ఈ బడ్జెట్ ఉందని ఆయన అన్నారు. ఈ బడ్జెట్ చారిత్రాత్మకమైనదని, ఇది భారత 'నారీ శక్తి'కి బలమైన ప్రతిబింబమని ప్రధాని అన్నారు. "మహిళా ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి రికార్డు సృష్టించారు" అని ఆయన కొనియాడారు. ప్రస్తుత కలలను వాస్తవంగా మార్చి, 2047 నాటికి వికసిత భారత్ సంకల్పాన్ని సాధించే దిశగా దేశం వేగంగా దూసుకెళ్లేందుకు ఈ బడ్జెట్ బలమైన పునాది వేస్తుందని మోదీ తెలిపారు. "ఈ బడ్జెట్ చాలా ప్రత్యేకమైనది. అధిక మూలధన వ్యయం, అధిక వృద్ధికి ప్రాధాన్యత ఇస్తూనే, ద్రవ్యలోటును తగ్గించడం, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడంపై దృష్టి సారిస్తుంది. కేవలం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఉండటంతోనే 140 కోట్ల మంది భారతీయులు సంతృప్తి చెందరు, త్వరలోనే ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాలని మేం లక్ష్యంగా పెట్టుకున్నాం" అని ఆయన స్పష్టం చేశారు. ఈ బడ్జెట్ 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' మిషన్లను వేగవంతం చేయడానికి సాహసోపేతమైన దార్శనికతను అందించిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కొత్త, సన్‌రైజ్ రంగాలకు అపూర్వమైన మద్దతు లభించిందన్నారు. "బయోఫార్మా శక్తి మిషన్, సెమీకండక్టర్ మిషన్ 2.0, ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ తయారీ పథకం, రేర్ ఎర్త్ కారిడార్ల అభివృద్ధి, కీలక ఖనిజాలపై దృష్టి, టెక్స్‌టైల్ రంగానికి కొత్త పథకాలు, హైటెక్, టెక్‌ఆధారిత తయారీని ప్రోత్సహించడం వంటివి ప్రపంచవ్యాప్తంగా భారతదేశం ఎదగడానికి కొత్త బలాన్ని అందిస్తాయి" అని ఆయన వివరించారు. మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి బడ్జెట్‌లో కీలక చర్యలు తీసుకున్నారని ప్రధాని తెలిపారు. ప్రత్యేకించి సరుకు రవాణా కారిడార్లు, హైస్పీడ్ రైల్ కారిడార్లు, టైర్ 2, టైర్ 3 నగరాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి, నగరాలకు బలమైన ఆర్థిక పునాదిని అందించడానికి మున్సిపల్ బాండ్లను ప్రోత్సహించడం వంటి చర్యలన్నీ వికసిత భారత్ వృద్ధి ప్రస్థానాన్ని వేగవంతం చేస్తాయని ఆయన అన్నారు.

**యువశక్తి బడ్జెట్**

ఆర్థిక మంత్రి పార్లమెంటులో చెప్పినట్లుగా, ఇది 'యువశక్తి బడ్జెట్' అని మోదీ అన్నారు. ఈ బడ్జెట్‌లోని కేటాయింపులు వివిధ రంగాలలో నాయకులను, ఆవిష్కర్తలను, సృష్టికర్తలను తయారు చేస్తాయని తెలిపారు. మెడికల్ హబ్‌ల నిర్మాణం, ఏవీజీసీ రంగాల ప్రోత్సాహం, పర్యాటకం, ఖేలో ఇండియా మిషన్ ద్వారా యువత రాణించడానికి, నాయకత్వం వహించడానికి మార్గాలను తెరుస్తుందన్నారు. "భారతదేశాన్ని గ్లోబల్ డేటా సెంటర్ హబ్‌గా మార్చడానికి పెద్ద పన్ను మినహాయింపు ప్రకటించాం. ఇది ఉపాధి కల్పనను గణనీయంగా పెంచుతుంది" అని పేర్కొంటూ యువతను ప్రత్యేకంగా అభినందించారు. మహిళల నేతృత్వంలోని స్వయం సహాయక సంఘాల కోసం ఆధునిక పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి ఈ బడ్జెట్ ప్రాధాన్యత ఇస్తుందని మోదీ వెల్లడించారు. బాలికల విద్యను సులభతరం చేసేందుకు ప్రతి జిల్లాలో కొత్త హాస్టళ్లు నిర్మించే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ వ్యవసాయం, మత్స్య రంగానికి ప్రాధాన్యత ఇస్తుందని, కొబ్బరి, జీడిపప్పు, కోకో, గంధపు చెక్కల రైతులకు మద్దతుగా కీలక చర్యలు ఉన్నాయని తెలిపారు. 'భారత్ విస్తార్ ఏఐ టూల్' రైతులకు వారి సొంత భాషలో సమాచారం అందించడంలో ఎంతగానో సహాయపడుతుందని అన్నారు. మొత్తం మీద ఈ బడ్జెట్ ఆశాజనకంగా ఉందని, దేశ ఆకాంక్షలను ప్రతిబింబిస్తుందని ప్రధాని మోదీ అన్నారు. గ్రామస్తులు, పేదలు, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చే ఈ భవిష్యత్, సమ్మిళిత బడ్జెట్‌ను రూపొందించినందుకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఆమె బృందాన్ని మరోసారి అభినందించారు.

# ఎస్సీ–ఎస్టీలకు బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం

**కేంద్ర మొండివైఖరిపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆగ్రహం**



**హైదరాబాద్, మహా :** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఎస్సీ-ఎస్టీ సంక్షేమానికి సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవడం సామాజిక న్యాయ స్ఫూర్తిని పూర్తిగా దెబ్బతీసినట్టేనని రాష్ట్ర ఎస్సీ-ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. బడ్జెట్ మొత్తాన్ని పరిశీలిస్తే దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతిపై కేంద్ర ప్రభుత్వానికి కనీస చిత్తశుద్ధి కూడా లేదన్న విషయం స్పష్టంగా తెలుస్తోందని ఆయన పేర్కొన్నారు. ఉపాధి, విద్య, ఆర్థిక స్వావలంబన, నైపుణ్యాభివృద్ధి వంటి కీలక రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతుంటే, కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ వర్గాల భవిష్యత్తును పూర్తిగా విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఇతర మంత్రులు పలుమార్లు ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో పాటు వివిధ కేంద్ర మంత్రులను కలిసి తెలంగాణ అభివృద్ధి, సామాజిక సంక్షేమ అంశాలపై విన్నవించినా, కేంద్రం మాత్రం మొండివైఖరితో వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్రానికి కనీస స్పందన కూడా ఇవ్వకపోవడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ప్రత్యేకంగా ఎస్సీ-ఎస్టీలకు సంబంధించిన స్కాలర్‌షిప్‌లు, హాస్టళ్లు, గురుకులాలు, ఉపాధి పథకాలు, ఆర్థిక సహాయ కార్యక్రమాలకు కేంద్రం నుంచి గట్టి మద్దతు లభిస్తుందని ఆశించామని, కానీ తాజా బడ్జెట్‌లో ఆ వర్గాల ఆశలన్నింటినీ నిరాశగా మార్చారని అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని దళితులు, ఆదివాసీలు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని హెచ్చరించారు. ఇది పేదల జీవన భద్రతను బలహీనపరిచే ప్రమాదకర విధానమని మంత్రి అడ్లూరి వ్యాఖ్యానించారు.

**తెలంగాణ రైజింగ్ – 2047పై కేంద్ర నిర్లక్ష్యం**

రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన విజన్‌తో ముందుకు వెళ్తున్నారని మంత్రి తెలిపారు. ఆ విజన్‌లో భాగంగా రాష్ట్రాన్ని అర్బన్ కోర్ - పెరి అర్బన్ - గ్రామీణ తెలంగాణగా మూడు జోన్లుగా విభజించి సమాన, సుస్థిర అభివృద్ధి సాధించేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి టెక్నాలజీ, ఇన్నోవేషన్, R&D హబ్‌గా, పెరి అర్బన్ ప్రాంతాలను MSMEలు, లాజిస్టిక్ హబ్‌స్‌గా, గ్రామీణ తెలంగాణను సాంకేతిక వ్యవసాయం, హస్తకళ పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యాలకు కేంద్ర సహకారం అత్యంత అవసరమని స్పష్టం చేశారు. సెమీకండక్టర్ సిటీలు, ఎనర్జీ పార్కులు, ఎలక్ట్రానిక్ మానుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు, మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌లు, డ్రైపోర్టులు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఇందిరా మహిళా శక్తి మిషన్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులకు కేంద్ర నిధుల కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. వ్యవసాయం, డెయిరీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఆరోగ్యం, విద్య, డిజిటల్ పాలన, హరిత విద్యుత్తు వంటి రంగాల్లో రాష్ట్రం ముందడుగు వేస్తుంటే, ఆ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాల్సిన బాధ్యతను విస్మరిస్తోందని అన్నారు. ఎస్సీ-ఎస్టీల హక్కులు, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పోరాటాన్ని కొనసాగిస్తుందని, కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రజల ముందు ఉంచి ప్రజాస్వామ్య పద్ధతుల్లో గట్టిగా ప్రశ్నిస్తామని మంత్రి అడ్లూరి స్పష్టం చేశారు. తెలంగాణకు జరుగుతున్న ఈ అన్యాయంపై మౌనం వహించబోమని, దళితులు-ఆదివాసీల భవిష్యత్తు కోసం అవసరమైతే మరింత తీవ్రమైన ఉద్యమాలకు కూడా సిద్ధమని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని తెలంగాణ అభివృద్ధి, సామాజిక న్యాయానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.



## ప్రజలను విస్మరించిన బడ్జెట్

**ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఫైర్**

**షేర్ మార్కెట్ కుప్పకూలింది బడ్జెట్ వల్లే - అఖిలేష్**

**ఢిల్లీ, మహా:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 202627 బడ్జెట్‌పై విపక్షాలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాయి. దేశం ఎదుర్కొంటున్న వాస్తవ ఆర్థిక, సామాజిక సవాళ్లను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. నిరుద్యోగం, తయారీ రంగం క్షీణత, రైతుల కష్టాలు వంటి కీలక సమస్యలను పరిష్కరించడంలో ఈ బడ్జెట్ ఘోరంగా విఫలమైందని ఆయన ఆదివారం విమర్శించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా రాహుల్ గాంధీ స్పందించారు. "ఉద్యోగాలు లేని యువత, పడిపోతున్న తయారీ రంగం, దేశం నుంచి తరలిపోతున్న పెట్టుబడులు, కుప్పకూలుతున్న కుటుంబ పొదుపు, రైతుల కష్టాలు, పొంచివున్న ప్రపంచ ఆర్థిక సంక్షోభాలు... వీటన్నింటినీ బడ్జెట్ పట్టించుకోలేదు. దిద్దుబాటు చర్యలకు నిరాకరిస్తున్న ఈ బడ్జెట్, భారతదేశ వాస్తవ సంక్షోభాల పట్ల గుడ్డిగా వ్యవహరిస్తోంది" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. రాహుల్‌తో పాటు ఇతర విపక్ష నేతలు కూడా బడ్జెట్‌పై పెదవి విరిచారు. వృద్ధిని పునరుద్ధరించడానికి, ఉపాధి కల్పించడానికి ఇందులో సరైన సంస్కరణలు లేవని విమర్శించారు.

**స్టాక్ మార్కెట్ పతనానికి బడ్జెట్టే కారణం**

సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ మరో అడుగు ముందుకేసి, స్టాక్ మార్కెట్ పతనానికి బడ్జెట్టే కారణమని ఆరోపించారు. "బీజేపీ బడ్జెట్ ఫలితం ఇదిగో.. షేర్ మార్కెట్ భారీగా కుప్పకూలింది. ఆదివారం మార్కెట్ తెరుస్తారా లేదా అన్నది ప్రశ్న కాదు, అది ఇంకా ఎంత పడిపోతుందన్నదే అసలు ప్రశ్న అని మేము ముందే చెప్పాం" అని ఆయన అన్నారు. ఈ బడ్జెట్ కేవలం 5 శాతం మంది ప్రజల కోసమేనని, కమీషన్లు దక్కించుకోవడానికి, బీజేపీ సొంత వ్యక్తులకు ప్రయోజనం చేకూర్చడానికే దీన్ని రూపొందించారని ఆయన తీవ్రంగా ఆరోపించారు. "ఇది బీజేపీ తరహా అవినీతికి కంటికి కనిపించని లెక్కల చిట్టా" అని అఖిలేష్ అభివర్ణించారు.

# పన్ను స్లాబ్‌లలో మార్పుల్లేవు

**టీసీఎస్, టీడీఎస్ సడలింపులతో ఊరట**




**న్యూఢిల్లీ :** ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తొమ్మిదవసారి వరుసగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 2026 27 ఆర్థిక సంవత్సరం కోసం పన్ను స్లాబ్‌లలో కొన్ని మార్పులను ప్రకటించారు. సీతారామన్ పన్ను విధానాలలో ఎటువంటి మార్పులు చేయనప్పటికీ, బడ్జెట్ 2026 టీసీఎస్, పన్ను చెల్లింపుదారుల కోసం కంప్లైన్స్ నిబంధనలలో ప్రధాన ఉపశమనం అందించారు. తన బడ్జెట్ 2026 ప్రసంగంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పన్ను తక్కువ చెల్లించే చెల్లింపుదారులపై ఒత్తిడిని తగ్గించడం, భారతదేశ స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. విస్తృతమైన పన్ను సంస్కరణలు, ఆర్థిక ప్రకటనలను ఆవిష్కరించారు. కొత్త ఆదాయపు పన్ను మినహాయింపులు, తక్కువ టీసీఎస్ రేట్ల నుంచి విదేశీ ఆస్తి వెల్లడి విండో, ప్రభుత్వ రుణాలపై స్పష్టత వరకు, ప్రతిపాదనలు ఆర్థిక వివేకం, పరిపాలనా సంస్కరణల మిశ్రమాన్ని ప్రతిబింబించేలా ఉన్నాయి.

**ఆర్థిక క్రమశిక్షణ, రుణ మార్గసూచి**

2026 ఆర్థిక సంవత్సరం నాటికి స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 4.5 శాతం కంటే ఆర్థిక లోటును తగ్గించనున్నట్లు ప్రభుత్వం ధృవీకరించింది. 2026 ఆర్థిక సంవత్సరం కోసం సవరించిన అంచనాలలో, ఆర్థిక లోటు జీడీపీలో 4.4 శాతంగా అంచనా వేశారు. 202627 ఆర్థిక సంవత్సరంలో (బడ్జెట్ అంచనాలు) కోసం.. ఇది జీడీపీలో 4.3 శాతంగా అంచనా. రుణజీడీపీ నిష్పత్తిని 55.6 శాతంగా నిర్ణయించారు. లోటును భర్తీ చేయడానికి ప్రభుత్వం 2027లో సెక్యూరిటీల ద్వారా 11.7 లక్షల కోట్లు రుణం తీసుకోనుంది. ఈ రుణ ప్రణాళిక సార్వభౌమ విడుదలలను ట్రాక్ చేస్తున్న బాండ్ మార్కెట్‌లు, సంస్థాగత పెట్టుబడిదారులకు స్పష్టతను అందిస్తుంది. ఇదిలా ఉండగా 16వ ఆర్థిక సంఘం 41 శాతం మేర బదిలీల నిలువు వాటాను కొనసాగించాలని సిఫార్సు చేసింది. కేంద్రం 2027 కోసం రాష్ట్రాలకు 1.4 లక్షల కోట్లు కేటాయించింది. ఇది స్థూల ఆర్థిక క్రమశిక్షణను కొనసాగిస్తూ రాష్ట్ర స్థాయి వ్యయాలకు మద్దతునిస్తుంది.

**మోటార్ ప్రమాద పరిహారం**

పరిహార లబ్ధిదారులను రక్షించే దిశగా తీసుకున్న చర్యలో మోటార్ యాక్సిడెంట్స్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ ద్వారా అందించిన ఏదైనా వడ్డీ ఇప్పుడు ఆదాయపు పన్ను నుంచి మినహాయించబడుతుంది. అటువంటి వడ్డీపై ఏదైనా టీడీఎస్ ని తొలగిస్తారు. ఇది పరిహార చెల్లింపులు మినహాయింపులు లేకుండా క్లెయిమ్‌దారులకు చేరుకునేలా చూస్తుంది.

**బైబ్యాక్ రిటర్న్స్**

షేర్ల బైబ్యాక్‌లలో పాల్గొనే పెట్టుబడిదారులకు ఏకరూపత, స్పష్టతను అందిస్తూ అన్ని రకాల వాటాదారుల కోసం బైబ్యాక్ ఆదాయాల పన్ను విధానం ఇప్పుడు మూలధన లాభాల పరిధిలోకి వస్తుందని ఆర్థిక మంత్రి ప్రకటించారు.

**ఐటీఆర్ గడువుల పొడిగింపు**

ఐటీఆర్ 1, ఐటీఆర్ 2లను దాఖలు చేయడానికి గడువు జూలై 31 వరకు కొనసాగుతుంది. ఇది జీతం తీసుకునే వ్యక్తులు, చిన్న పన్ను చెల్లింపుదారులకు స్థిరత్వాన్ని, ఖచ్చితత్వాన్ని అందిస్తుంది. అదనంగా నామమాత్రపు రుసుము చెల్లించిన తర్వాత ఆదాయపు పన్ను రిటర్న్‌లను సవరించడానికి డిసెంబర్ 31 నుంచి మార్చి 31 వరకు అందుబాటులో ఉన్న సమయం పొడిగింపు కానుంది. ఈ విండో ద్వారా పన్ను చెల్లింపుదారులకు లోపాలను సరిదిద్దడానికి అదనపు సమయాన్ని అనుమతిస్తుంది. ఆడిట్ చేయని వ్యాపార కేసులు, ట్రస్టులు ఇప్పుడు ఆగస్టు 31 వరకు రిటర్న్‌లను దాఖలు చేయడానికి అనుమతించారు. కొత్త ఆదాయపు పన్ను చట్టం ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుందని ఆర్థిక మంత్రి ధృవీకరించారు. 10 శాతం అదనపు పన్ను చెల్లించిన తర్వాత కూడా తిరిగి అంచనా ప్రక్రియలు ప్రారంభమైన తర్వాత కూడా పన్ను చెల్లింపుదారులు తమ రిటర్న్‌లను అప్‌డేట్ చేసుకోవచ్చు. ఈ నిబంధన స్వచ్ఛంద కంప్లైన్స్‌ను ప్రోత్సహించడానికి, దావాలను తగ్గించడానికి హెల్ప్ చేస్తుంది.

**విదేశీ ఆస్తి వెల్లడి పథకం**

ఆర్థిక మంత్రి పన్ను చెల్లింపుదారుల కోసం ఆరు నెలల విదేశీ ఆస్తి వెల్లడి పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ విండో వ్యక్తులు విదేశీ ఆస్తులను ప్రకటించడానికి మరియు కంప్లైన్స్ అవసరాలకు అనుగుణంగా ఉండటానికి ఒక అవకాశాన్ని అందిస్తుందని భావిస్తున్నారు. అదనంగా, మొత్తం విలువ రూ. 20 లక్షల కంటే తక్కువ ఉన్న స్థిరమైన విదేశీ ఆస్తులను వెల్లడించడంలో విఫలమైన వ్యక్తులకు ప్రాసిక్యూషన్ నుండి మినహాయింపు లభిస్తుంది. ఈ మినహాయింపు అక్టోబర్ 1, 2024 నుండి అమలులోకి వస్తుంది, ఇది చిన్నవిలువ కలిగిన విదేశీ ఆస్తి హోల్డర్‌లకు కంప్లైన్స్ ఒత్తిడిని తగ్గిస్తుంది.

**ప్రయాణికులు, కుటుంబాలకు ఉపశమనం**

విదేశీ పర్యటన కార్యక్రమాల ప్యాకేజీల అమ్మకంపై వసూలు చేసిన పన్ను (టీసీఎస్)ని 2 శాతానికి తగ్గించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. అంతేకాకుండా, విద్య, వైద్య ప్రయోజనాల కోసం లిబరలైజ్డ్ రెమిటెన్స్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) కింద టీసీఎస్ ని 5 శాతం నుంచి 2 శాతానికి తగ్గించనున్నారు. ఈ చర్య ఉన్నత విద్య లేదా వైద్య చికిత్స కోసం విదేశాలకు నిధులు పంపే కుటుంబాలకు నగదు ప్రవాహ ఒత్తిడిని తగ్గించే అవకాశం ఉంది.

**గ్లోబల్ క్లౌడ్ కంపెనీలకు పన్ను సెలవు**


బడ్జెట్‌లో దీర్ఘకాలిక నిర్మాణాత్మక ప్రకటనలలో భారతదేశంలో డేటా కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా క్లౌడ్ సేవలను అందించే విదేశీ కంపెనీలకు 2047 వరకు పన్ను సెలవు ఇచ్చింది. భారతీయ డేటా కేంద్రాల ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న కస్టమర్‌లకు క్లౌడ్ సేవలను అందించే గ్లోబల్ కంపెనీలు ఈ ప్రోత్సాహానికి అర్హత పొందుతాయి. అయితే భారతీయ కస్టమర్‌ల కోసం.. సేవలు తప్పనిసరిగా భారతీయ సంస్థ ద్వారా రూట్ చేయాలి. ఈ చర్య భారతదేశ డేటా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వ్యవస్థను బలోపేతం చేయడమే. దేశాన్ని గ్లోబల్ డిజిటల్ హబ్‌గా ఉంచడం లక్ష్యంగా పెట్టుకుంది.

**ఎన్ఆర్ఐ ఆస్తి లావాదేవీల టీడీఎస్**

ఎన్ఆర్ఐల ద్వారా స్థిర ఆస్తి అమ్మకంపై టీడీఎస్ ఇప్పుడు వారి పాన్ ఆధారిత చలాన్‌ను ఉపయోగించి నివాసి కొనుగోలుదారుల ద్వారా మినహాయిస్తారు. జమ చేస్తారు. ఇది టీఏఎన్ (ట్యాక్స్ డిడక్షన్ అండ్ కలెక్షన్ అకౌంట్ నంబర్) పొందవలసిన అవసరాన్ని తొలగిస్తుంది. ఇది పేపర్‌వర్క్‌ను తగ్గిస్తుంది. సరిహద్దు ఆస్తి లావాదేవీలను క్రమబద్ధీకరిస్తుంది.

# స్థిరత్వంపై దృష్టి సారించిన బడ్జెట్

**మహా:** ప్రభుత్వ లోటు తగ్గింపు ఒక వైపు.. స్పష్టమైన రుణ ప్రణాళిక, రుణజీడీపీ పథకం ద్వారా ఆర్థిక క్రమశిక్షణను బలోపేతం చేస్తోంది. మరోవైపు ఇది పొడిగించిన ఫైలింగ్ టైమ్‌లైన్‌లు టీసీఎస్ రేట్లు, మారిన టీడీఎస్ విధానాలు, చిన్న పన్ను చెల్లింపుదారులకు ఉపశమనం ఇస్తోంది. ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆదాయపు పన్ను చట్టం అమలులోకి రావడంతో, బహుళ విధాన సంస్కరణలు సిద్ధంగా ఉండటంతో బడ్జెట్ 2026 స్థూల ఆర్థిక వివేకంతో వృద్ధిని సమతుల్యం చేస్తూ స్పష్టత కంప్లైన్స్, మూలధన ఏర్పాటు దిశగా ఒత్తిడిని సూచిస్తుంది. అంతేకాకుండా పాత, కొత్త ఆదాయపు పన్ను విధానం కింద పన్ను స్లాబ్‌లలో ఎటువంటి మార్పులు చేయలేదని సీతారామన్ ప్రకటించారు.



# మహా పత్రిక








## నా ఆనందాన్ని మాటల్లో చెప్పలేను

**మెగాస్టార్ చిరంజీవి**

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ - ఉపాసన దంపతులకు కవలలు జన్మించడంతో మెగా కుటుంబంలో పండుగ వాతావరణం నెలకొంది. ఎంతో కాలంగా మనవడు, మనవరాలి కోసం ఎదురుచూస్తున్న మెగాస్టార్ చిరంజీవికి ఈ వార్తతో తన కల నెరవేరినట్లయింది. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని అపోలో ఆసుపత్రి వద్ద మెగాస్టార్ మీడియా సమావేశం నిర్వహించి తన సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ఇంట్లోకి ఇద్దరు వారసులు రావడం మాటల్లో చెప్పలేని ఆనందాన్ని ఇస్తోందని, తల్లి ఉపాసనతో పాటు ఇద్దరు బిడ్డలు కూడా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని వెల్లడించారు. ఉపాసనకు విజయవంతంగా ప్రసవం చేసిన వైద్య బృందానికి చిరంజీవి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబాన్ని ఎల్లప్పుడూ గుండెల్లో పెట్టుకుని ఆదరిస్తున్న అభిమానులకు, శ్రేయోభిలాషులకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలియజేస్తూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. “మా ఇంట్లో ఈ శుభం జరగాలని ఎప్పటి నుంచో కోరుకుంటున్నాం, ఈ రోజు అది సాకారమైంది” అంటూ చిరంజీవి ఆనంద బాష్పాలతో ముగించారు.




## మెగా ట్విన్స్‌కు తారక్ వెల్‌కమ్..

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, ఉపాసన దంపతులకు కవల పిల్లలు జన్మించిన వేళ సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే వీరికి పలువురు సినీ ప్రముఖులతో పాటు అభిమానులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలుపుతుండగా తాజాగా అగ్ర కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ కూడా సోషల్ మీడియా వేదికగా హృదయపూర్వక అభినందనలు తెలియజేశాడు. తారక్ తన ఎక్స్ ఖాతాలో స్పందిస్తూ.. ‘రామ్ చరణ్, ఉపాసనలకు కవలలు జన్మించినందుకు అభినందనలు. మీ కుటుంబం ఎల్లప్పుడూ ప్రేమ, ఆరోగ్యం మరియు ఆనందంతో వర్ధిల్లాలని కోరుకుంటున్నాను’. అంటూ తారక్ రాసుకోచ్చాడు. ఉపాసన శనివారం రాత్రి కవల పిల్లలకు జన్మనివ్వగా.. ఈ విషయాన్ని మెగాస్టార్ చిరంజీవి స్వయంగా సోషల్ మీడియా ద్వారా పంచుకుంటూ, తల్లి మరియు పిల్లలిద్దరూ క్షేమంగా ఉన్నారని తెలిపారు.



## వైరల్ అవుతున్న రామ్ చరణ్ స్పెషల్ ఫొటో

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, ఉపాసన దంపతులు రెండోసారి తల్లిదండ్రులయిన సంగతి తెలిసిందే. శనివారం రాత్రి హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో ఉపాసన కవల పిల్లలకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని మెగాస్టార్ చిరంజీవి స్వయంగా సోషల్ మీడియా వేదికగా వెల్లడిస్తూ తన ఆనందాన్ని పంచుకున్నారు. తల్లీబిడ్డలు ముగ్గురూ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు ధృవీకరించారు. అయితే ఈ సందర్భంగా రామ్ చరణ్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక స్పెషల్ ఫొటోను షేర్ చేశారు. తన భార్య ఉపాసన, పెంపుడు కుక్కలతో కలిసి ఉన్న అందమైన ప్రెగ్నెన్సీ ఫోటోషూట్‌ను పంచుకుంటూ, తమ జీవితంలోకి కొత్త అతిథులు రావడం పట్ల ఎమోషనల్ అయ్యారు. క్లింకారతో కలిపి ఇప్పుడు ముగ్గురు పిల్లల తండ్రి అయినందుకు చాలా కృతజ్ఞతగా ఉందని, తమ జీవితంలో మహిళలే గొప్ప బలమని ఆయన పేర్కొన్నారు. కాగా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటో వైరల్‌గా మారింది.



## హిట్ కోసం విజయ్ దేవరకొండ ప్రయత్నాలు..

### ప్రత్యేక పాత్రలలో సీనియర్ యాక్టర్స్

యూత్‌లో ప్రత్యేక ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ కెరీర్‌లో మరో కీలక మలుపు చోటు చేసుకోనుంది. గత కొంతకాలంగా సరైన కమర్షియల్ హిట్ కోసం ఎదురుచూస్తున్న ఆయన, తాజాగా వరుస ప్రాజెక్టులతో బిజీ అవుతూ కొత్త స్ట్రాటజీని అమలు చేస్తున్నాడు. ఇటీవల విడుదలైన ‘కింగ్‌డమ్’ ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడంతో, ఇప్పుడు మరింత జాగ్రత్తగా కథల ఎంపికలో ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో దర్శకుడు రవికిరణ్ కోలా తెరకెక్కిస్తున్న ‘రౌడీ జనార్ధన్’ సినిమా ప్రత్యేకంగా నిలుస్తోంది. గ్రామీణ నేపథ్యంలో సాగే పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం విజయ్ కెరీర్‌లో విభిన్నమైన ప్రయత్నంగా భావిస్తున్నారు. టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోలో చూపించిన మాస్ ఎలిమెంట్స్, గ్రామీణ వాతావరణం సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచాయి. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో పాటు బలమైన టెక్నికల్ టీమ్ పనిచేస్తుండటం విశేషం. హీరోయిన్‌గా కీర్తి సురేష్ ఎంపిక కావడం సినిమాకు అదనపు ఆకర్షణగా మారింది. నటీనటుల ఎంపిక విషయంలో దర్శకుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఇండస్ట్రీ వర్గాల సమాచారం.ఇక కథలో భావోద్వేగాలకు కీలకమైన పాత్రల కోసం అనుభవజ్ఞులైన నటులను తీసుకుంటున్నట్లు టాక్ వినిపిస్తోంది.

సీనియర్ నటి శోభన ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నారన్న వార్త సినిమాకు మరింత ప్రాధాన్యం తీసుకొచ్చింది. అలాగే సీనియర్ హీరో రాజశేఖర్ కూడా ప్రత్యేక పాత్రలో కనిపించే అవకాశాలున్నట్లు చర్చ నడుస్తోంది. భారీ తారాగణం, గ్రామీణ శైలిలో సాగే యాక్షన్ కథాంశం, పీరియాడిక్ టచ్ అన్నీ కలిసి ‘రౌడీ జనార్ధన్’ను విజయ్ దేవరకొండకు మాస్ కమ్బ్యాక్ మూవీగా నిలబెడతాయనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.




## జన నాయగన్ సెన్సార్‌పై తొలిసారి స్పందించిన విజయ్

విజయ్ నటించిన ‘జన నాయగన్’ చిత్రం ఎప్పుడు విడుదల అవుతుందో తెలీదు. ఈ అంశంపై ఆయన అభిమానులు భగ్గుమంటున్నారు. నిర్మాతకు కోట్లలో నష్టం వస్తుందని ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ అంశంపై ఇప్పటికే దర్శక నిర్మాతలు స్పందించారు. అయితే, తాజాగా విజయ్ తొలిసారి జన నాయగన్ వాయిదాపై మాట్లాడారు. ఇంగ్లీష్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో విజయ్ పలు వ్యాఖ్యలు చేశారు. సినిమాను ఇలా అడ్డుకోవడం చాలా బాధ అనిపించిందని పేర్కొన్నారు. ఈ మూవీ నిర్మాతను తలుచుకుంటేనే తనకు బాధ కలుగుతోందని పేర్కొన్నారు. తాను రాజకీయ ప్రవేశం చేయడం వల్ల తనకు ఇలాంటిది ఏదో జరుగుతుందని ముందే ఊహించానన్నారు. అందుకు తాను మెంటల్‌గా సిద్ధం అయినట్లు నటుడు విజయ్ పేర్కొన్నారు. ఈ సినిమా నిర్మాత వెంకట్ కె.నారాయణ కూడా పలుమార్లు విడుదల ఆలస్యంపై బాధపడ్డారనేది తెలిసిందే. సెన్సార్ చిక్కువల వల్ల జనవరి 9న విడుదల కావాల్సిన ‘జన నాయగన్’ వాయిదా పడింది. కనీసం విడుదల ఎప్పుడు అనేది కూడా క్లారిటీ లేదు. దర్శకుడుహెచ్ .వినోద్ తెరకెక్కించిన ఈ చిత్రం విజయ్ కెరీర్‌లో చివరిది కావడం విశేషం. ఇందులో పూజా హెగ్డే కథానాయకిగా నటించగా మలయాళ బ్యూటీ మమిత బైజు కీలక పాత్ర పోషించారు.

### కాలేజ్ స్టూడెంట్స్‌తో శ్రీలీల రచ్చ..

## పెళ్లాన్ని అడిగినట్టే అడిగారు



‘పెళ్లి సందడి’ సినిమాతో టాలీవుడ్‌లో అడుగుపెట్టిన శ్రీలీల చాలా తక్కువ సమయంలోనే యూత్‌లో భారీ క్రేజ్ సంపాదించుకుంది. అందం, ఎనర్జిటిక్ డ్యాన్స్‌లు, చురుకైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆమె వరుస అవకాశాలను అందుకుంటూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. పెద్ద హీరోలతో పాటు యువ హీరోల సరసన కూడా నటిస్తూ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఇటీవల శ్రీలీల ఓ విద్యాసంస్థ కార్యక్రమంలో పాల్గొని మరోసారి వార్తల్లో నిలిచింది. పల్నాడు జిల్లా నరసరావుపేటలో నిర్వహించిన ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరైంది. విద్యార్థులతో కలిసి స్టేజ్‌పై డ్యాన్స్ చేస్తూ, వారితో సరదాగా ముచ్చటిస్తూ అందరినీ ఉత్సాహపరిచింది. తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఈ ప్రాంతానికి ఎప్పుడో వచ్చానని, మళ్లీ రావడం ఆనందంగా ఉందని తెలిపింది. చదువుతో పాటు లక్ష్యాలను కూడా స్పష్టంగా పెట్టుకోవాలని విద్యార్థులకు సూచించింది. స్టేజ్‌పై మాట్లాడుతున్న సమయంలో విద్యార్థులు డ్యాన్స్ చేయమని కోరగా, శ్రీలీల సరదాగా స్పందించి అందరినీ నవ్వుల్లో ముంచెత్తింది. ఆమె చెప్పిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ నెటిజన్లలో చర్చనీయాంశమయ్యాయి. అభిమానులు ఆమె హ్యూమర్ సెన్స్‌ను మెచ్చుకుంటున్నారు. అయితే తే డ్యాన్స్ చేయమని కింద ఉన్న అబ్బాయిలు గట్టిగా అరవడంతో శ్రీలీల స్పందిస్తూ.. “నిజంగా పెళ్ళాన్ని అడిగినట్లు అడిగారు.. డ్యాన్స్ చేద్దాం.. కమాన్” అని అనడంతో పిల్లలు డ్యాన్స్ వేసి చప్పట్లు కొట్టారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై నెటిజన్లు ఫన్నీ కామెంట్స్ చేస్తున్నారు.

కెరీర్ పరంగా చూస్తే శ్రీలీల కన్నడ చిత్రం ‘కిస్’ ద్వారా సినీ రంగ ప్రవేశం చేసి, తెలుగు ప్రేక్షకులకు ‘పెళ్లి సందడి’తో పరిచయమైంది. ‘ధమాకా’ విజయంతో ఆమెకు భారీ గుర్తింపు వచ్చింది. అనంతరం పలువురు స్టార్ హీరోల సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంది. ఇటీవల కొన్ని సినిమాలు ఆశించిన విజయాన్ని సాధించకపోయినా, ఆమెకు వచ్చిన పాత్రలు మంచి పేరును తెచ్చిపెట్టాయి. ప్రస్తుతం ధనుష్ హీరోగా తెరకెక్కుతున్న ఒక పెద్ద ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా ఎంపిక కావడం ఆమె కెరీర్‌కు కొత్త ఊపును ఇచ్చింది. తెలుగులో ‘ఉస్తాద్ భగత్ సింగ్’, హిందీలో కార్తీక్ ఆర్యన్‌తో ఒక చిత్రం చేస్తూ బిజీగా కొనసాగుతోంది.



## అలా.. ఆ అదృష్టాన్ని కోల్పోయా!

ఇన్‌స్టా రీల్స్‌తోనే ఇన్‌స్టంట్‌గా సినిమా చాన్స్ కొట్టేసింది సాక్షి వైద్య. పేరుకు తగ్గట్టే.. ఆమె వైద్యురాలు కూడా. ఫిజియో థెరపిస్ట్‌గానూ సేవలు అందించిందట. సోషల్ మీడియాలో దక్కిన పాపులారిటీతో.. ‘ఏజెంట్’తో జట్టుకట్టి తెరంగేట్రం చేసింది. ఆ తర్వాత ‘గాండీవధారి అర్జున’ సరసన మెరిసింది. పవర్‌స్టార్ పక్కన ‘ఉస్తాద్ భగత్‌సింగ్’లో అవకాశం దక్కినా.. అనుకోకుండా సినిమాను మిస్ చేసుకుంది. తాజాగా, ‘నారీనారీ నడుమ మురారి’ అంటూ.. తెరపై సందడి చేస్తున్నది. సంక్రాంతికి హిట్ కొట్టేసి, ఫుల్ జోష్‌మీదున్న సాక్షి.. పంచుకున్న కబుర్లు! కొవిడ్ సమయంలో ఇంట్లో ఖాళీగా ఉండేదాన్ని. అప్పుడు సరదాగా చేసిన కొన్ని రీల్స్.. సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. మంచి ఫాలోయింగ్ కూడా వచ్చింది. అప్పుడే నాకూ నటనపై ఆసక్తి పెరిగింది. దాంతో ఆడిషన్స్ ఇవ్వడం మొదలుపెట్టా! అలా ‘ఏజెంట్’లో సెలెక్ట్ అయ్యాను. సినిమా అవకాశం వచ్చిన తర్వాతే.. నటనపై మరింత శ్రద్ధ పెట్టాను. ఏజెంట్ సినిమా షూటింగ్ సమయంలోనే నిర్మాత అనిల్ గారు నాతో మరో సినిమా చేస్తానని హామీ ఇచ్చారు. ఆ ప్రామిస్ నిలబెట్టుకుంటూ.. ‘నారీనారీ నడుమ మురారి’లో అవకాశం ఇచ్చారు. సినిమా కథతోపాటు నేను పోషించిన ‘నిత్య’ క్యారెక్టర్ కూడా నాకు బాగా నచ్చింది. ఈ పాత్ర.. నాకు వ్యక్తిగతంగా చాలా దగ్గరగా ఉంటుంది. నేను కూడా నిత్యలాగే.. ఇన్నోసెంట్, నిజాయతీగా ఉండే అమ్మాయినే. ‘ఏజెంట్’కు ముందుకూడా కొన్ని అవకాశాలు వచ్చాయి. కొందరు నిర్మాతలు ఫోన్ చేసి సినిమా అవకాశాల గురించి చెప్పారు. కానీ, స్క్రిప్ట్ నచ్చక వాటిని అంగీకరించలేదు. ఆ తర్వాత ‘ఏజెంట్’ ఆఫర్ వచ్చింది. అందులో హీరో అఖిల్ అనీ, మమ్ముట్టి లాంటి అగ్రతారలు ఉంటారని మొదట నాకు తెలియదు. వాళ్లతో కలిసి ఎలా నటిస్తానా?! అని మొదట భయపడ్డాను. కానీ, సెట్‌లో వాళ్లందరూ చాలా సాయం చేశారు.సినిమాల్లోకి రాకముందు ఫిజియోథెరపిస్ట్‌గా పనిచేశా. సినిమాల మీద మక్కువతోనే ఈ రంగంలోకి వచ్చా.ఖాళీ సమయం దొరికితే పుస్తకాలను బాగా చదువుతాను. కావాల్సినంత నిద్రపోతాను. నేను భరతనాట్యం కూడా నేర్చుకున్నా. పవన్ కళ్యాణ్ సరసన ‘ఉస్తాద్ భగత్ సింగ్’లో అవకాశం రావడమే అదృష్టం. వారం రోజులు షూటింగ్‌లోనూ పాల్గొన్నా! కానీ, డేట్లు సర్దుబాటు చేయలేక ఆ అవకాశం వదులుకున్నా. పవన్ సర్ చాలా రేర్‌గా డేట్స్ ఇస్తారు. ఒకరోజు డైరెక్టర్ హరీశ్ శంకర్ కాల్ చేసి.. డేట్స్ కావాలని అడిగారు. ఎల్లుండే షూటింగ్ అని చెప్పారు. కానీ, ఆ సమయంలో నేను ఫ్యామిలీ ఎమర్జెన్సీ వల్ల వారం రోజులు అందుబాటులో లేకుండా పోయాను. అలా డేట్స్ ఇష్యూ వల్ల ఆ సినిమాను మిస్ అయ్యాను.

## సూర్య 46కు క్రేజీ టైటిల్..




కోలీవుడ్ యాక్టర్ సూర్య లక్కీ భాస్కర్ ఫేం వెంకీ అట్లూరితో చేస్తున్న చిత్రం సూర్య 46 (Suriya 46). ఈ మూవీలో ప్రేమలు ఫేం మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీకి సంబంధించి ఏదో ఒక వార్త నెట్టింట రౌండప్ చేస్తూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. ఇంకా టైటిల్ ఖరారు కానీ ఈ చిత్రానికి మేకర్స్ ఓ పేరు ఫైనల్ చేశారన్న వార్త ఆన్‌లైన్‌లో రౌండప్ చేస్తోంది. తాజా టాక్ ప్రకారం ఈ చిత్రానికి విశ్వనాథం అండ్ సన్స్ (Vishwanadham and Sons) టైటిల్‌ను ఫిక్స్ చేశారని ఇన్‌సైడ్ టాక్. ఈ క్రేజీ టైటిల్ అఫీషియల్ అయితే ఇంతకీ సూర్యతో వెంకీ అట్లూరి ఎలాంటి కథను చూపించబోతున్నాడన్నది ఆసక్తికరంగా మారింది. అంతేకాదు ఈ మూవీని జులై 2026లో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేలా ప్లాన్ చేస్తున్నారట. సూర్య కరుప్పు విడుదలైన తర్వాత ప్రమోషన్స్‌ను షురూ చేయనున్నారట.ఈ మూవీలో సీనియర్ యాక్టర్లు రాధికా శరత్ కుమార్, రవీనా టాండన్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ మూవీకి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్రంలో సూర్య పాత్ర గజినీలో సంజయ్ రామస్వామి లైన్‌లో సాగనుందని టాక్ నడుస్తోంది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రం 45 ఏండ్ల వ్యక్తికి 20 ఏండ్ల యువతికి మధ్య రిలేషిన్ షిప్ నేపథ్యంలో ఉండబోతున్నట్టు సమాచారం. సూర్య 46 చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ , ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశి, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో సూర్య టాలీవుడ్ ఎంట్రీ ఇస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. సూర్య మరోవైపు సుధాకొంగర డైరెక్షన్‌ల సూర్య 47లో నటిస్తున్నాడని తెలిసిందే.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034